కార్పొరేషన్ రాబడికి నిబంధనల గండి

- షాపుల వేలం ఎప్పుడో మరి?
- నాలుగేళ్లుగా మూసి ఉన్న నాలుగు షాపులు
- ఎనిమిది సార్లు వేలం ప్రకటించినా ముందుకు రాని వ్యాపారులు
- అద్దె ఎక్కువ కావడంతో భయపడుతున్న వైనం


దానవాయిపేటలో మూతపడి ఉన్న నగర పాలక సంస్థ షాపులు

రాజమహేంద్రవరం సిటీ: నగరంలో నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో లక్షలాది రూపాయల వ్యయంతో నిర్మించిన షాపులను అద్దెకు ఇవ్వడంలో అధికారులు శ్రద్ధ కనపరచడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నగర వ్యాప్తంగా 39 ప్రాంతాల్లో 690 షాపులను నగర పాలక సంస్థ నిర్మించి అద్దె ప్రాతిపదికన చిరు వ్యాపారులకు అందించింది. నగరంలో ప్రధాన ప్రాంతమైన దానవాయిపేట గానుగ వీధిలో నాలుగు రోడ్ల జంక్షన్‌లో నాలుగేళ్ల క్రితం నాలుగు షాపులను నిర్మించారు. ఈ భవనంపై అంతస్తులో 12వ నంబర్ వార్డు సచివాలయాన్ని ఏర్పాటు చేశారు. అయితే నిర్మాణం చేపట్టిన నాలుగు షాపులను నాలుగు సంవత్సరాలు పూర్తయినప్పటికీ ఇప్పటివరకు చిన్న తరహా వ్యాపారులకు అందించేందుకు చర్యలు చేపట్టకపోవడంపై పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. నాలుగేళ్ల కాలంలో షాపులను వేలం ద్వారా కేటాయించేందుకు ఇప్పటికి ఎనిమిది సార్లు వేలం ప్రకటించారు. అయితే ఈ వేలంలో పాల్గొని షాపులను పొందేందుకు చిరు వ్యాపారులు సాహసం చేయకపోవడంతో నాలుగేళ్లుగా షాపుల వేలం కొలిక్కిరాలేదు. అయితే నగరపాలక సంస్థకు చెందిన స్థలంలో ఈ షాపుల నిర్మాణానికి నగరపాలక సంస్థ 20 లక్షల రూపాయలు ఖర్చు పెట్టడంతో షాపు ఒక్కొక్క దానికి ఐదు లక్షల ప్రాథమిక ధర నిర్ణయించి వేలం నిర్వహించే చర్యలు చేపట్టారు. దీంతోపాటు నెలకు రూ.16 వేల చొప్పున అద్దె ప్రాతిపదికన వేలం నిర్వహించేందుకు అవసరమైన ప్రకటనను వెలువరిస్తున్నారు. షాపులను కేటాయించేందుకు పలుమార్లు వేలం ప్రకటనకు తేదీలు నిర్ణయించి ప్రకటించినా వ్యాపారులు ఎవరు ఈ షాపులను దక్కించుకునేందుకు పోటీ పడకపోవడంతో నాలుగు సంవత్సరాలుగా షాపులు ఏ విధమైన ఆదాయం లేకుండానే ఉండిపోయాయి. ఈ షాపులను పొందేందుకు వేలంలో ఎవరూ ముందుకు రాకపోవడంతో నగర పాలక సంస్థ ప్రత్యామ్నాయ చర్యలు ఏమీ చేపట్టపోవడంతో నగరపాలక సంస్థ ఆదాయానికి గండిపడుతోంది.

నిబంధనలు సడలిస్తే వేలానికి అవకాశం

షాపులు వేలంలో పాల్గొనేందుకు చిరు వ్యాపారాలు ఎవరు రాకపోవడాన్ని నగరపాలక సంస్థ అధికారులు గమనించినా ఇప్పటి వరకూ ఏవిధమైన చర్యలు పట్టక పోవడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. షాపుల వేలంలో పాల్గొనేందుకు ముందస్తు సొమ్మును తగ్గించి వేలం నిర్వహించడంతో పాటు షాపుల నెలవారీ అద్దెను తగ్గిస్తే వేలంలో పాల్గొనేందుకు కొందరైనా ఆసక్తి కనబరిచే వారని పలువురు అభిప్రాయపడుతున్నారు. లక్షలాది రూపాయల ప్రజాధనంతో నిర్మాణం చేపట్టిన షాపులను ఆదాయం లేకుండా వదిలివేయడంతో షాపులు పాడయ్యే అవకాశం ఉంది. ఎప్పటికైనా నగరపాలక సంస్థ అధికారులు చొరవ చూపి, నిబంధనలు సడలించి వేలం నిర్వహించేందుకు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. నగరానికి కొత్తగా కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన కేతన్ గార్గ్ ఈ షాపులు విషయంలో ప్రత్యేక శ్రద్ధతో ఆలోచించి చిరు వ్యాపారులకు అందించేందుకు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. ఈ విషయమై నగర పాలక సంస్థ రెవెన్యూ మేనేజర్ శ్రీనివాసరావును వివరణ కోరగా కార్పొరేషన్ నిబంధనల ప్రకారం భవన నిర్మాణం ఖర్చును విభజించి రూ.ఐదు లక్షల ప్రారంభ ధర నిర్ణయించాం. ప్రభుత్వ లెక్కల ప్రకారం షాపు విస్తీర్ణాన్ని ప్రాంతాన్ని అనుసరించి అద్దెను నిర్ణయిస్తామన్నారు.

అధికారులు ఆలోచించాలి



నాలుగేళ్లుగా వేలం నిర్వస్తున్నా చిరు వ్యాపారులు ముందుకు రాకపోవడంపై నగర పాలక సంస్థ అధికారులు ఆలోచించాలి. వేలం పాటలో పాల్గొనేందుకు ముందస్తుగా నిర్ణయించిన రూ.ఐదు లక్షలు పెద్ద మొత్తం కావడంతో వేలంలో పాల్గొనేందుకు ఎవరూ ముందుకు రావడం లేదు. దీనిపై అధికారులు పునరాలోచన చేయాలి. ఇప్పటికైనా అధికారులు ఆలోచించి ధర నిర్ణయించాలి

– అడపా అనిల్‌కుమార్, రాజమహేంద్రవరం

అద్దె తగ్గించాలి



రూ.ఐదు లక్షల నుంచి ఆపై ఎంత పెరిగినా అంత సొమ్ము చెల్లించే స్తోమత లేని చిరు వ్యాపారులు వేలంలో పాల్గొనడం లేదు. నెలకు 16 వేల రూపాయల అద్దె ఎక్కువ కావడంతో ఎవరూ ముందుకురావడం లేదు. ఈవిధమైన విధానాల వల్ల నాలుగేళ్ళుగా నగరపాలక సంస్థ ఆదాయానికి లక్షలాది రూపాయల మేర గండి పడింది. అధికారులు ఇప్పటికైనా ఆలోచన మార్చుకుని రేటు తగ్గించి వేలం నిర్వహించాలి. లేని పక్షంలో షాపులు పాడయ్యే ప్రమాదం ఉంది.

– దల్లి రాజశేఖరరెడ్డి, రాజమహేంద్రవరం

క్లుప్తంగా

కోట సత్తెమ్మ కృప అందరిపై ఉండాలి


అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న సూర్యప్రకాశరావు తదితరులు

సీటీఆర్ఐ: భక్తుల ఇలవేల్పు కోట సత్తెమ్మ కృప అందరికీ అందాలని మాజీ ఎమ్మెల్యే, రుడా మాజీ చైర్మన్ రౌతు సూర్యప్రకాశరావు ఆకాంక్షించారు. అమ్మవారికి ప్రీతిపాత్రమైన ఆషాఢ మాస అమావాస్య సందర్భంగా ఆది వారం స్థానిక రెండవ వార్డు నారాయణపురంలోని వాంబే గృహాల వద్ద ఉన్న శ్రీ కోట సత్తెమ్మ వారి ఆలయంలో కుంకుమ పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రౌతు సూర్యప్రకాశరావు పాల్గొని మాట్లాడారు. ప్రతి ఏటా అమ్మవారికి విశేష కార్యక్రమాలు నిర్వహిస్తున్న ఆలయ కమిటీని అభినందించారు. సమాజం మంచి దారిలో పయనించేందుకు దైవారాధన ఎంతగానో ఉపయోగపడుతుందని రౌతు ఈ సందర్భంగా గుర్తు చేశారు కమిటీ సభ్యులు, పితాని లక్ష్మి కుమారి, సూరిబాబు, రామకృష్ణ, కొల్లి ప్రసాద్ పాల్గొన్నారు.

వీటీ కాలేజీ పూర్వ విద్యార్థుల కలయిక

కంబాలచెరువు: స్థానిక వీటీ జూనియర్ కాలేజీలో 1972, 74 బ్యాచ్ ఇంటర్మీడియెట్ బైపీసీ చదివిన విద్యార్థులు ఆదివారం స్నేహితుల దినోత్సవం సందర్భంగా కలిశారు. వేంకటేశ్వర నగర్‌లోని ఐఎంఏ హాలులో డాక్టర్ దాట్ల భాస్కరరాజు ఆధ్వర్యంలో జరిగిన ఆత్మీయ సమ్మేళనానికి స్థానికులతో పాటు సుదూర ప్రాంతాల నుంచి పలువురు వచ్చారు. ముందుగా వీరేశలింగం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఇటీవల కాలంలో కన్నుమూసిన మిత్రులకు సంతాపంగా రెండు నిముషాలు మౌనం పాటించారు. కాలేజీ రోజుల్లో మధుర స్మృతులను నెమరువేసుకున్నారు. కేక్ కట్ చేసి శుభాకాంక్షలు చెప్పుకున్నారు. అందరూ గ్రూప్ ఫొటో దిగారు. ఈ వయసులో నూతన ఉత్సాహంతో ముందుకు సాగడానికి ఈ ఆత్మీయ సమ్మేళనం దోహద పడుతుందని వారు ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎం.ఆదివిష్ణు, ప్రసాదరాజు, గంగాధర్, ఏవీవీఎస్ కామరాజు, సప్పా రామకృష్ణ, బి.ఉమామహేశ్వరరావు, వి.మహారాజు, కేదారేశ్వరరావు, కె.అశోక్‌బాబు, సీతామరామయ్య, అబ్రహం లింకన్, ఎస్.బసవేశ్వరరావు హాజరయ్యారు.

యవకుడిని కాపాడిన జీఆర్పీ పోలీసులు


జీఆర్పీ పోలీసులు కాపాడిన యువకుడు

రాజమహేంద్రవరం సిటీ: ప్రేమ విఫలమై ఐఎల్‌టీడీ దగ్గరలో రైలు పట్టాలపై ఆత్మహత్య చేసుకునేందుకు ప్రయత్నించిన తాడితోటకు చెందిన భైరి మధును జీఆర్పీ కానిస్టేబుల్స్ చంద్రశేఖర్, చిన్న కాపాడారు. ఆదివారం జరిగిన ఈ ఘటనలో ఆత్మహత్య చేసుకునేందుకు వేగంగా వస్తున్న రైలుకు అడ్డంగా పట్టాలపై నిలబడిన మధును కాపాడి పోలీసు స్టేషన్‌కు తీసుకురాగా ఇన్‌స్పెక్టర్ విజశంకర్ మధుకు కౌన్సెలింగ్ నిర్వహించి తల్లిదండ్రులకు అప్పగించారు. సమాచారం అందుకుని స్పందించి మధును కాపాడిన ఇద్దరు కానిస్టేబుళ్లను ఇన్‌స్పెక్టర్ విజయశంకర్ అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో హార్లిక్స్ ఫ్యాక్టరీ ఉద్యోగి మృతి

ధవళేశ్వరం: ధవళేశ్వరం జాతీయ రహదారిపై ఆదివారం గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో హార్లిక్స్ ఫ్యాక్టరీ ఉద్యోగి వాసంశెట్టి వెంకట సుబ్రహ్మణ్యం (55) మృతి చెందాడు. ఈ ఘటనకు సంబంధించి ధవళేశ్వరం పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. వేమగిరితోట ప్రాంతానికి చెందిన వాసంశెట్టి వెంకట సుబ్రహ్మణ్యం ఆదివారం మధ్యాహ్నం హార్లిక్స్ ఫ్యాక్టరీకి బయలుదేరారు. ధవళేశ్వరం భూలోకమ్మ గుడి సమీపంలో ఎదురుగా గుర్తుతెలియని వాహనం వచ్చి ఢీకొట్టింది. సుబ్రహ్మణ్యం జేబులో ఉన్న ఫోన్ నుంచి స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. దీంతో వారు రాజమహేంద్రవరంలోని ఒక ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అనంతరం చికిత్స పొందుతూ సుబ్రహ్మణ్యం మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ధవళేశ్వరం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నగరంలో పోలీసుల తనిఖీలు

కంబాలచెరువు: నగరంలో పోలీసులు ఆదివారం విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. శనివారం ఒకే సమయంలో మూడు చోట్ల జరిగిన వరుస చైన్ స్నాచింగ్‌లతో అప్రమత్తమైన పోలీసులు తనిఖీలు ముమ్మరం చేశారు. వాహనదారులను తనిఖీ చేశారు.

కాస్మోపాలిటన్ క్లబ్‌పై పోలీసుల దాడి

కంబాలచెరువు: ఆర్యాపురంలోని కాస్మోపాలిటన్ క్లబ్‌పై పోలీసులు దాడి చేసి ఆదివారం కేసు నమోదు చేశారు. పేకాడుతున్న 10 మందిని అదుపులోకి తీసుకున్నారు. దీనిపై మూడో పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు.

యామినీ కృష్ణమూర్తికి భట్రాజుల సంఘం నివాళి


కృష్ణమూర్తి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సంఘ సభ్యులు

సీటీఆర్ఐ: యామినీ కృష్ణమూర్తి జీవితం నృత్యానికి అంకితమని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా భట్రాజుల సంఘం అధ్యక్షుడు సేవారత్న లోలభట్టు శ్రీనివాసరాజు కొనియాడారు. ఆదివారం స్థానిక జేఎన్‌రోడ్డు షిర్డీ సాయి మార్గ్‌లో గల హెరిటేజ్ రాయల్ అపార్ట్‌మెంట్ కార్యాలయం ఆధ్వర్యంలో పద్మశ్రీ, పద్మ విభూషణ్ స్వర్గీయ యామినీ కృష్ణమూర్తి మృతికి భట్టరాజ సంఘ సభ్యులు శ్రద్ధాంజలి ఘటించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంబేపల్లి వాసి భారతీయ నర్తకి పద్మశ్రీ యామిని కృష్ణమూర్తి (84) భట్రాజుల కులానికి వన్నె తెచ్చారని, భరతనాట్యం కూచిపూడి, ఒడిస్సీ నృత్యాలలో నిష్ణాతురాలిగా పేరు తెచ్చుకున్నారన్నారు. ముంగర కృష్ణమూర్తి రాజు దంపతులకు 1940 డిసెంబర్ 20న జన్మించిన ఆమె మరణం శోచనీయమన్నారు. ఆమె దేశ విదేశాలలో అనేక ప్రదర్శనలు ఇచ్చి భారతమాత సిగలో జాబిలమ్మలా ప్రజలకు గుర్తుండిపోతారన్నారు. 17 ఏళ్ల వయసుకే పద్మశ్రీ అవార్డును సంపాదించిన ఘనత ఈమెదన్నారు. అంతర్జాతీయ స్థాయిలో కూచిపూడి నాట్యానికి ఖ్యాతి రావడానికి చాలా కాలం ముందే ఈమె అమెరికా, ఐరోపా, ఇంగ్లాండ్, ఫ్రాన్స్, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ ,ఇండోనేషియా వంటి దేశాలలో నృత్యాభినయం చేశారన్నారు. కార్యదర్శి చల్లగాలి వెంకటరామరాజు, ఆర్గనైజింగ్ సెక్రటరీ కార్యభట్టు రవీందర్‌రాజు పాల్గొన్నారు.

నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు కీలకం


కడియం దేవీచౌక్ సెంటర్‌లో వాహనాలు తనిఖీ చేస్తున్న ఇన్‌స్పెక్టర్ తులసీధర్, సిబ్బంది

కడియం: నేరాల నియంత్రణ, కేసుల దర్యాప్తులో సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తాయని కడియం పోలీస్ ఇన్‌స్పెక్టర్ బి.తులసీధర్ అన్నారు. మండల కేంద్రమైన కడియంలోని దేవీ సెంటర్‌లో సీసీ కెమెరాలను ఆయన ఆదివారం పరిశీలించారు. గతంలో పోలీసులు, దాతల సహకారంతో ఏర్పాటు చేసిన ఈ కెమెరాల నిర్వహణా లోపంతో పనిచేయడం లేదన్నారు. దీంతో మండల టీడీపీ అధ్యక్షుడు వెలుగుబంటి నాని సుమారు పదివేల రూపాయలతో వాటిని పునరుద్ధరించారన్నారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ ఒక సీసీ కెమెరా వంద మంది పోలీస్ సిబ్బందితో సమానమని, సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాలను నియంత్రించవచ్చన్నారు. మండల పరిధిలోని అన్ని గ్రామాల ప్రజలు, ప్రజా ప్రతినిధులు ముందుకు రావాలని, గ్రామాల్లో ప్రధాన కూడళ్లలో విధిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని తులసీధర్ కోరారు. స్వీయ రక్షణ కోసం కూడా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. యువత అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని, గంజాయి వంటి మత్తు పదార్థాలకు అలవాటు పడి బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని అన్నారు. వారిని సక్రమమైన మార్గంలో నడిపించాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందన్నారు. మహిళలకు, బాలికలకు ఏమైనా ఇబ్బందులు తలెత్తితే వెంటనే తమను సంప్రదించాలని సూచించారు. ప్రతి ఒక్కరూ విధిగా రోడ్డు భద్రతా నియమాలు పాటించాలన్నారు. అనంతరం స్పెషల్ డ్రైవ్ నిర్వహించి ఏకకాలంలో పెద్ద సంఖ్యలో వాహనాల తనిఖీ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా, ధ్రువీకరణ పత్రాలు లేని వాహనాలను స్టేషన్‌కు తరలించారు. ఎస్సైలు టి.దుర్గాప్రసాద్, కృష్ణసాయి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

స్నేహితులతో ఎస్పీ ఫ్రెండ్ షిప్ డే


స్నేహితులతో స్నేహితుల దినోత్సవంలో పాల్గొన్న ఎస్పీ నరసింహాకిశోర్

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): జిల్లా ఎస్పీ డి.నరసింహాకిశోర్ ఆదివారం తన పాత స్నేహితులతో స్నేహితుల దినోత్సవాన్ని జరుపుకున్నారు. ఆయనతో విద్యాభ్యాసం చేసిన తోటి మిత్రులు ఆదివారం ఎస్పీని కలిసి కొంతసేపు గడిపారు. ఆయనతో చిన్ననాటి ముచ్చట్లు ముచ్చటించారు. అనంతరం ఎస్పీని వారు శాలువాతో సత్కరించి పూలమాలలు వేసి స్నేహితుల దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి


మొక్కలు పంచి పెడుతున్న శ్రీధర్‌రెడ్డి తదితరులు

రాజమహేంద్రవరం సిటీ: పర్యావరణ పరిరక్షణకు మనమంతా కృషి చేయాలని జిల్లా భారత్ స్వాభిమాన్ ట్రస్ట్ అధ్యక్షుడు, యోగ గురువు కేఎస్‌పీ శ్రీధర్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం నగరంలో దానవాయిపేట రౌండ్ పార్కు వద్ద తూర్పుగోదావరి జిల్లా భారత్ స్వాభిమాని ట్రస్ట్, మహిళా పతంజలి యోగ సమితి ఆధ్వర్యంలో ఆచార్య బాలకృష్ణ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని వనమూలికా దినోత్సవం నిర్వహించారు. శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ జీవన విధానంలో అవసరమైన మూలికలు అందించే మొక్కలు మన చుట్టూనే ఉన్నాయని వాటిని వినియోగించుకోవడం ద్వారా ఆరోగ్యవృద్ధి పొందవచ్చునని పేర్కొన్నారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ యోగా ట్రైనీ టీచర్స్ ద్వారా 50కి పైగా అనేక రకాల వనమూలికా మొక్కలను సేకరించి వాటి విశిష్టతను రౌండ్ పార్క్ లో ఉన్న సందర్శకులకు వివరించి, మొక్కలను వారికి ఉచితంగా పంచి పెట్టారు. ఈ కార్యక్రమంలో తూర్పుగోదావరి మహిళా పతంజలి యోగ సమితి అధ్యక్షురాలు వేణు, ఉపాధ్యక్షురాలు కర్రి సత్యలలితా కుమారి, అసిస్టెంట్ యోగ ట్రైనీ టీచర్స్ పాల్గొన్నారు.

ఘనంగా పవర్ లిఫ్టింగ్ పోటీలు


పవర్ లిఫ్టింగ్ విజేతలతో ఎమ్మెల్యే గోరంట్ల

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరు నేతాజీనగర్‌లో ఆదివారం తూర్పుగోదావరి జిల్లా పవర్‌లిఫ్టింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 8వ చాంపియన్ షిప్ 2023–24 పవర్ లిఫ్టింగ్ పోటీలు ఘనంగా నిర్వహించారు. విజేతలకు ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి చేతులమీదుగా బహుమతులు అందించారు. సాయిపవర్ జిమ్ నిర్వాహకులు, పవర్ లిఫ్టింగ్ తూర్పుగోదావరిజిల్లా అసోసియేషన్ కార్యదర్శి డీవీవీ సత్యనారాయణ మాట్లాడుతూ పవర్ లిఫ్టింగ్ పోటీల గురించి వివరించారు. ఎంపీడీవో డి.శ్రీనివాసరావు, మండల టీడీపీ అధ్యక్షుడు మత్సేటి ప్రసాద్, మాజీ ఉపసర్పంచ్ కామిని ప్రసాదచౌదరి, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

విజేతలు వీరే

పురుషుల విభాగంలో అండర్–15 సబ్ జూనియర్స్‌లో ఆస్టన్, 59 కిలోల కేటగిరిలో వై.రాజు, వై.వీరబాబు, ఎల్‌కేఎస్ ప్రకాష్, 66 కిలోల విభాగంలో ఎస్.పవన్, కె.ప్రదీప్‌కుమార్, 74 కిలోల విభాగంలో ఎం.సాయిదుర్గాప్రసాద్, ఎం.దొరబాబు, 83 కిలోల విభాగంలో సీహెచ్ సాయిప్రవీణ్, ఎస్.ఆనంద్ కైవల్య, వై.శ్రావణ్, 93 కిలోల విభాగంలో సీహెచ్ వెంకటేష్, ఎస్.అజయ్, ఏ.సాయి, 93+కిలోల కేటగిరిలో వై.చైతన్య, ఎస్‌కె.సోహైల్, పి.శ్రీనంద, మాస్టర్స్(ఎం–1)42–50 విభాగంలో వీఎస్ ప్రసన్న, బీహెచ్‌టీ శివరాజు, మాస్టర్స్(ఎం–2)50–60 విభాగంలో టి.వీరబాబు, ఎస్.రామకృష్ణ, మాస్టర్స్(60+)లో డి.శ్రీనివాసరావు(ఎంపీడీవో, రాజమహేంద్రవరంరూరల్), మహిళల 70కిలోల విభాగంలో సీహెచ్ శ్రీదివ్య, ప్రచ్చిటి సావంత్, ఎస్.దుర్గాభవాని, 83 కిలోల విభాగంలో శృతిఅగర్వాల్, ఎస్.చివం, సిహెచ్.లక్ష్మీ ప్రసన్న విజేతలుగా నిలిచారు.

ఐక్యతతో ముందుకు సాగుదాం

ధవళేశ్వరంలో సమావేశమైన డ్యాన్సర్స్ అసోసియేషన్ సభ్యులు


ధవళేశ్వరంలో సమావేశమైన డ్యాన్సర్స్ అసోసియేషన్ సభ్యులు

ధవళేశ్వరం: ఐక్యతతో ముందుకు సాగాలని డ్యాన్సర్స్ అసోసియేషన్ నాయకులు పిలుపునిచ్చారు. ఆదివారం ధవళేశ్వరంలోని జోషి డ్యాన్స్ అకాడమీలో రిథమ్ ఆఫ్ ఆంధ్ర, డాన్సర్స్ అసోసియేషన్ సభ్యులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా అసోసియేషన్ నాయకులు మాట్లాడుతూ అసోసియేషన్‌లో ప్రతి సభ్యునికి ఇన్సూరెన్స్ సదుపాయాన్ని కల్పించామన్నారు. మహిళా డ్యాన్సర్స్ భద్రతకు అసోసియేషన్ ప్రాధాన్యం ఇస్తుందన్నారు. అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు ప్రసాద్, హరీష్, అధ్యక్షుడు సతీష్, ఉపాధ్యక్షుడు జోషి, విజయ్, కార్యదర్శి కాశీ, కోశాధికారి శివప్రసాద్, అసోసియేషన్ నాయకులు ఈశ్వర్, రాజా, చక్రి పాల్గొన్నారు.

పూలు, పండ్ల విత్తనాల పంపిణీ

ఘనంగా సిటీ ఆఫ్ టెర్రస్ గార్డెన్స్ రాజమహేంద్రవరం గ్రూప్ వార్షికోత్సవం


గ్రూపు సభ్యురాలికి మామిడిమొక్కను అందజేస్తున్న గ్రూప్ అడ్మిన్

రాజమహేంద్రవరం రూరల్: రాజమహేంద్రవరం పరిసర ప్రాంతాలలో టెర్రస్ గార్డెన్స్ నిర్వహిస్తున్న అందరూ సిటీ ఆఫ్ టెర్రస్ గార్డెన్ రాజమహేంద్రవరం గ్రూప్‌ను మూడేళ్ల క్రితం ఏర్పాటు చేసుకున్నారు. టెర్రస్ గార్డెన్ నిర్వాహకులు ఐవీవీ వరప్రసాదరావు, ఖాన్‌భాయ్, యర్రా శేషుకుమారి, అబ్దుల్లాలు అడ్మిన్‌లుగా ప్రతి ఒక్కరు మిద్దె తోటల పెంపకం ద్వారా ఎటువంటి కెమికల్స్ వాడకుండా సహజసిద్ధంగా పండించి తినాలన్న ఏకైక లక్ష్యంతో గ్రూపు ఏర్పాటు చేసుకున్నారు. అప్పటి నుంచి గ్రూపులో పండ్లు, కూరగాయలు, పువ్వులు, మొక్కల పెంపకం తదితర అంశాలతో పాటు, మొక్కల పెంపకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను గ్రూపు సభ్యులు పంచుకుంటున్నారు. మూడేళ్ల నుంచి ఈ గ్రూపు విజయవంతంగా నిర్వహిస్తున్నారు. గ్రూపు సభ్యులు తమకు అవసరమైన కూరగాయలు, పండ్లు, పువ్వులు పండించుకుంటూ నలుగురికీ ఆదర్శంగా నిలిస్తున్నారు. సిటీ ఆఫ్ టెర్రస్ గార్డెన్స్ రాజమహేంద్రవరం గ్రూప్ తృతీయ వార్షికోత్సవం ఆదివారం గ్రూప్ అడ్మిన్స్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ పాల్గొని మహిళలు ఉత్సాహంగా టెర్రస్‌గార్డెన్స్ నిర్వహించడం అభినందనీయమని అన్నారు. పెద్దాపురంనకు చెందిన టెర్రస్ గార్డెన్ నిర్వాహకులు వేణుగోపాలరావును సన్మానించారు. గ్రూపు సభ్యులకు కాయగూరలు, పువ్వులు, పండ్లు, మొక్కల విత్తనాలను పంపిణీ చేశారు.

హెచ్‌పీ గ్యాస్ కార్యాలయంలో అగ్ని ప్రమాదం

10 లక్షల ఆస్తినష్టం


కడియంలోని హెచ్‌పీ గ్యాస్ కార్యాలయం నుంచి వెలువడుతున్న పొగలు


కడియం: మండల కేంద్రమైన కడియంలోని శ్రీ వెంకట శశి హెచ్‌పీ గ్యాస్ కంపెనీ కార్యాలయంలో ఆదివారం ఉదయం అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో సుమారు రూ.పది లక్షల మేర ఆస్తినష్టం సంభవించిందని హెచ్‌పీ గ్యాస్ డీలర్ జి.రాజశేఖర్ తెలిపారు. ఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. కడియం శ్రీనగర్‌కాలనీ నుంచి భాస్కర్‌నగర్‌కు వెళ్లే రోడ్డులో ఇటీవలే కొత్తగా నిర్మించిన భవనంలో గ్రౌండ్ ఫ్లోర్‌లో హెచ్‌పీ గ్యాస్ కార్యాలయాన్ని నిర్వహిస్తున్నారు. భవనం పైఅంతస్తుల్లో నిర్మాణ పనులు ఇంకా జరుగుతున్నాయి. అయితే ఆదివారం ఉదయం పెయింట్ పనులు చేసేందుకు కార్మికులు సదరు భవనం వద్దకు వచ్చేసరికి హెచ్‌పీ గ్యాస్ కార్యాలయం షట్టర్ల నుంచి పొగలు రావడాన్ని గమనించారు. వెంటనే భవన యజమాని, గ్యాస్ డీలర్‌కు సమాచారం ఇచ్చారు. వారొచ్చి షట్టర్ తెరచే సరికి లోపల మంటలు చెలరేగుతున్నాయి. ఈ ప్రమాదంలో కంప్యూటర్లు, ప్రింటర్లు, సురక్ష ట్యూబ్‌లు, రెగ్యులేటర్ తదితర వస్తువులతో పాటు, కార్యాలయం ఇంటీరియర్ మొత్తం కాలిబూడిదైపోయింది. రాజమహేంద్రవరం ఫైర్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వగా వచ్చి మంటలను ఆర్పివేశారు. కాగా ప్రమాదానికి షార్ట్ సర్క్యూట్ కారణంగా భావిస్తున్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు కడియం పోలీస్‌లు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చిత్ర బృందం సందడి


శివజ్యోతి థియేటర్‌లో సందడి చేస్తున్న చిత్రబృందం

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): శ్రీ నీలకంఠం మహాదేవ ఎంటర్‌టైన్‌మెంట్ నిర్మాణ సంస్థ సారథ్యంలో రాజమహేంద్రవరానికి చెందిన పవన్ కుమార్ కొత్తూరి నటించి, దర్శకత్వం వహించిన యావరేజ్ స్టూడెంట్ నాని చిత్రం యూనిట్ నగరంలో శనివారం రాత్రి సందడి చేసింది. స్థానిక శివజ్యోతి థియేటర్లో ప్రదర్శితమవుతున్న యావరేజ్ స్టూడెంట్ నాని చిత్ర ప్రదర్శనను సెకండ్ షోకు యూనిట్ చిత్రబృందం అభిమానుల మధ్య తిలకించింది. ఈ సందర్భంగా నటుడు, చిత్ర దర్శకుడు పవన్ కుమార్ కొత్తూరి మాట్లాడుతూ ఈ చిత్రం అన్ని వర్గాల వారిని ముఖ్యంగా యూత్‌ను అలరించడంపై సంతోషం వ్యక్తం చేశారు. ఈ చిత్రాన్ని గోదావరి నది, కడియం పూల మొక్కల నర్సరీల అందాల మధ్య చిత్రీకరించినట్లు తెలిపారు. హీరోయిన్‌లు సారా, బిశాల్ గోయల్ మాట్లాడుతూ తాము పోషించిన పాత్రలు కథతో ముడిపడి ఉంటాయన్నారు. భవిష్యత్తులో మరిన్ని మంచి పాత్రలు లభిస్తాయని అభిలషించారు. ఈ చిత్రాన్ని యూత్ ఆదరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ చిత్రానికి నిర్మాతలు పవన్ కుమార్ కొత్తూరి, బిశాల్ గోయల్. సంగీతం కార్తీక్ కొడకండ్ల, ఫైట్స్ నందు, కొరియోగ్రఫీ రాజు పాడే.

పలువురికి ఆసరాగా స్వర్ణాంధ్ర సేవా కేంద్రం


వినికిడి యంత్రాన్ని అందిస్తున్న రాంబాబు

రాజమహేంద్రవరం సిటీ: రాజమహేంద్రవరం చుట్టుపక్కల గ్రామాల నుంచి ఎవరికి ఏ సాయం కావలసినా తమ సంస్థ ఆసరాగా నిలుస్తుందని స్వర్ణాంధ్ర నిర్వాహకులు డాక్టర్ గుబ్బల రాంబాబు తెలిపారు. ఆదివారం లాలాచెరువులోని స్వర్ణాంధ్ర వృద్ధాశ్రమ ప్రాంగణంలో పలువురికి గొడుగులు అందించడంతో పాటు రాజానగరానికి చెందిన కే.సింహాచలంకు రూ.26,000 విలువైన వినికిడి యంత్రాన్ని అందించారు. కే.నాగేంద్ర అనే నిరాశ్రయునికి వాకర్ ను బహూకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రోడ్లపై వ్యాపారం చేసుకునే చిరు వ్యాపారాలకు గొడుగులు, అలాగే ప్రమాదవశాత్తూ ఇబ్బందులు పడుతున్న వారి కోసం వీల్ చైర్లు, ట్రై సైకిల్స్, చెవిటి మూగవారి కోసం యంత్రాలు, సరిగా నడవలేని వృద్ధులు వికలాంగుల కోసం వాకర్స్ చేతి కర్రలతో పాటు అనేక రకాలుగా అవసరార్థులను ఆదుకోవడంలో స్వర్ణాంధ్ర సేవా సంస్థ నిత్యం ఎవరో ఒకరికి సహాయం అందిస్తూనే ఉంటుందన్నారు. స్వర్ణాంధ్ర మేనేజర్ ఇలియాస్ సుధీర్, కుట్టు శిక్షణ టీచర్ దివ్య ,చిన్నారి, సురేష్ ,జగదీష్ పాల్గొన్నారు.

నిర్లక్ష్యానికి అద్దం పడుతూ.. ప్రమాదాలను ఆహ్వానిస్తూ..


ప్రమాదకరంగా ఉన్న ఇనుప స్తంభం ముక్క

స్థానిక ఐఎల్‌టీడీ సెంటర్ నుంచి గోదావరి గట్టు వెళ్లేమార్గంలో సత్యసాయి మందిరం వద్ద భారీ వాహనాల, కార్లు రాకపోకలను నిరోధిస్తూ నాలుగు ఐరన్ పోల్స్‌ను నగరపాలక సంస్థ అధికారులు ఏర్పాటు చేశారు. కార్లు వెళ్లేందుకు అనువుగా అందులోని ఒక స్తంభాన్ని కోయించి ముక్కను నిర్లక్ష్యంగా వదిలేశారు. ఆ ముక్క వల్ల రాత్రి సమయాల్లో కార్లకు పంక్చర్‌లు పడడంతో పాటు, ద్విచక్ర వాహనదారులు చూసుకోకుండా రావడం వలన ప్రమాదాలు బారిన పడుతున్నారు. ఇప్పటికైనా నగరపాలక సంస్థ అధికారులు స్పందించి ఇనుప స్తంభం ముక్కను పూర్తిగా తొలగించే ఏర్పాటు చేయాలని స్థానికులు, వాహన చోదకులు కోరుతున్నారు.

–ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్):